క్లుప్తంగా

ఉపాధి హామీ పనులు ప్రారంభం

గుంటూరు రూరల్: పెదనందిపాడు మండలం నాగులపాడులో ఉపాధి హామీ పథకంలో భాగంగా సుమారు రూ.20 లక్షల నిధులతో పనులను ఎమ్మెల్యే బి.రామాంజనేయులు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు జరిగితే సహించేది లేదన్నారు. అభివృద్ధి పనులకు ఆటంకాలు కలిగించవద్దని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మి, ఏపీఎం రవి, గ్రామ సెక్రెటరీ శ్వేత, ఎమ్మార్వో వెంకటస్వామి, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

సింహ వాహనంపై భావన్నారాయణుడు



పొన్నూరు: పట్టణంలోని శ్రీ సాక్షి భావన్నారాయణ స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా గురువారం స్వామివారికి పంచామృత స్నపన, తిరువంజనోత్సవం నిర్వహించారు. రాత్రి స్వామిని నరసింహస్వామిగా అలంకరించి సింహ వాహనంపై ఊరేగించారు. కనులపండువగా సాగిన గ్రామోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జీఎంసీ వెబ్‌సైట్, యాప్ ఆవిష్కరణ

నెహ్రూనగర్: గుంటూరు నగర పాలక సంస్థకు సంబంధించి అధికారిక వెబ్ సైట్, మొబైల్ యాప్‌ను నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర ఆవిష్కరించారు. గురువారం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి వాటిని ప్రారంభించారు. వీటిని మెరుగు పరిచేందుకు సూచనలు అందించాలని ప్రజలను కోరారు. ఫిర్యాదులు, సేవలను పొందేందుకు వీటిని అందుబాటులోకి తెచ్చామన్నారు. అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, విభాగాధిపతులు, డిప్యూటీ కమిషనర్లు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆయుష్ ఆసుపత్రికి స్థల పరిశీలన




గుంటూరు రూరల్: ప్రత్తిపాడు మండలం నడింపాలెం గ్రామంలో సర్వే నంబర్ 149–4ఏ లో ఆయుష్ ఆసుపత్రి నిర్మాణానికి కేటాయించే స్థలాన్ని అధికారులు పరిశీలించారు. గురువారం కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ నుంచి వచ్చిన ఆదేశాల ప్రకారం కేంద్ర మంత్రిత్వ శాఖ ప్రతినిధుల బృందం సీసీఆర్ వైఎన్ డైరెక్టర్ డాక్టర్ రాఘవేంద్రరావు, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వరరావు, డాక్టర్ మోహనరావు, కన్సల్‌టెంట్ భరత్ భూషణ్, ఎమ్ఏ ఖాన్ తదితరులు ఏపీ ప్రభుత్వ ఆయుష్ డైరెక్టర్ కె.దినేష్‌కుమార్, తెనాలి సబ్ కలెక్టర్ వి.సంజనసింహాలతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మండల స్థాయి, రెవెన్యూ, ఆయుష్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

తూకంలో మోసాలపై అప్రమత్తత ముఖ్యం

నెహ్రూనగర్: తూకంలో మోసాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని లీగల్ మెట్రాలజీ డిప్యూటీ కంట్రోలర్ షాలేం రాజు పేర్కొన్నారు. ఈ నెల 20వ తేదీన మెట్రాలజీ డేని పురస్కరించుకుని 8వ తేదీ నుంచి 20వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాల్లో భాగంగా గురువారం కృష్ణానగర్ రైతుబజార్‌లో తూకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వస్తువులను కొనుగోలు చేసే సమయంలో కాటాలను జాగ్రత్తగా గమనించాలన్నారు. అనంతరం పాత సామాన్లు, పేపర్లు కొనుగోలు చేసే వారు ఎటువంటి రాళ్లను ఉపయోగించి మోసం చేస్తున్నారనే అంశంపై అధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫుడ్ కమిటీ సభ్యుడు డాక్టర్ చదలవాడ హరిబాబు, లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ కొండారెడ్డి, ఇన్‌స్పెక్టర్ జి. సునీల్‌రాజు పాల్గొన్నారు.

గుంటూరు చానల్‌లో పడి వ్యక్తి మృతి



పెదకాకాని: ప్రమాదవశాత్తూ కాలువలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన తక్కెళ్లపాడులో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన షేక్ మీరావలి (51) కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాడు. గురువారం గ్రామంలోని జెండా చెట్టు పక్కనే ప్రవహిస్తున్న గుంటూరు చానల్(కొత్త కాలువ) గోడపై కూర్చున్నాడు. ప్రమాదవశాత్తూ కాలుజారి కాలువలో పడ్డాడు. చుట్టుపక్కల వారు గుర్తించి కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే మీరావలి మృతి చెందాడు. మృతదేహాన్ని ఇంటికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

ఈదురు గాలులు.. విద్యుత్ సమస్యలు

- చిన్నపాటి గాలికి సైతం విద్యుత్ సరఫరాలో అంతరాయం
- ముందస్తు చర్యలు చేపట్టని విద్యుత్‌శాఖ అధికారులు



విద్యుత్ అంతరాయంతో అంధకారంలో ఐలాండ్ సెంటర్

పొన్నూరు: పట్టణంలో విద్యుత్తు సౌకర్యాలు మెరుగుకు చర్యలు తీసుకుంటున్నామని విద్యుత్ అధికారులు గొప్పలు చెప్పడమే తప్ప ఆచరణలో అమలు కావడంలేదు. ముందస్తు చర్యలు లేకపోవడంతో వేసవిలో విద్యుత్తు సమస్యలు వినియోగదారులను వెంటాడుతున్నాయి. పట్టణ పరిధిలో సుమారు 26 వేల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. వాటి ద్వారా ప్రతినెలా వినియోగదారుల నుంచి సుమారు రూ.2.80 కోట్ల వరకు బిల్లులను వసూలు చేస్తున్నారు. ఈ ప్రకారం ఏడాదికి రూ.35 కోట్ల మేర వినుయోగదారులు ఇబ్బందులు పడుతూనే విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ముందస్తు చర్యలు లేకపోవడంతో విద్యుత్తు సౌకర్యాలు ఆశించిన స్థాయిలో ఉండడంలేదన్న ఆరోపణలు వినియోగదారుల నుంచి వినిపిస్తున్నాయి.

అంధకారంతో తప్పని అవస్థలు..

పట్టణంలో అనేక చోట్ల విద్యుత్తు తీగలు బలహీనపడ్డాయి. వాటి స్థానంలో కొత్త తీగల ఏర్పాటు దీర్ఘకాలంగా అసంపూర్తిగానే మిగిలి ఉంది. ఈ కారణంగా తరచూ విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. అసలే వేసవి.. అందులోనూ విద్యుత్తు పోయినప్పుడు రాత్రి వేళల్లో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటికంపాడు రోడ్డులో సింగిల్ ఫేజ్ లైను కారణంగా అనేక కుటుంబాలు సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు రాత్రి వేళ అంధకారంతో అవస్థలు పడుతున్నాయి. గాలి వీస్తే కరెంటు అంతరాయం కలుగుతుందని వాపోతున్నారు. ఎస్బీబీ రోడ్డులో విద్యుత్ స్తంభాలకు అధికంగా ప్రైవేటు వైర్లు వేలాడుతున్నా పట్టించుకోవడం లేదు. అనేక వీధుల్లో విద్యుత్తు తీగలు, ఇళ్లకు ఉండే సర్వీసు తీగలు తక్కువ ఎత్తులో వేలాడుతూ వాహనదారులకు ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.

రాత్రి వేళ సమస్య అధికం..

విద్యుత్తు నియంత్రిక లోడు చాలకపోవడంతో తరచూ ఫీజులు పోతూ విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతోంది. పట్టణంలో గురువారం సాయంత్రం 5 గంటల నుంచి 8 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడటంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అంధకారంలోనే సమయాన్ని గడిపారు. ఈ విషయంపై విద్యుత్ ఇన్‌చార్జి ఏఈ మురళీకృష్ణని వివరణ కోరగా.. గాలి వీయడంతో విద్యుత్ వైర్లు కదిలిన కారణంగా సరఫరాలో అంతరాయం కలిగిందని తెలిపారు. వెంటనే మరమ్మత్తులు చేసి విద్యుత్తు సరఫరాలో అంతరాయం లేకుండా చేశామన్నారు.



ఒకేచోటే అధికంగా వేలాడుతున్న విద్యుత్ తీగలు

ఆరోగ్యానికి సేంద్రియ వ్యవసాయం



సేంద్రియ పద్ధతులను తెలుసుకుంటున్న డాక్టర్ మాధవిలత

గుంటూరు రూరల్: సేంద్రియ వ్యవసాయం ద్వారా ఆరోగ్యకరమైన పంటలను పండించి ప్రజల ఆరోగ్యాలను కాపాడవచ్చని రైతుబజార్ సీఈవో డాక్టర్ మాధవిలత తెలిపారు. రెండు రోజులుగా వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలో రైతునేస్తం ఫౌండేషన్‌లో ఏర్పాటు చేసిన సేంద్రియ వ్యవసాయం, విలువల జోడింపు రైతులు, సేంద్రియ అధికారుల శిక్షణ తరగతులకు ఆమె ముఖ్యఅతిథిగా గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సేంద్రియ వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలకు రైతుబజార్‌లలో ప్రత్యేకంగా దుకాణాలను కేటాయిస్తామని తెలిపారు. రసాయనాలతో కూడిన పంటల ద్వారా ప్రస్తుతం ప్రజలు అనేక వ్యాధుల బారిన పడుతున్నారని అన్నారు. రైతులంతా సేంద్రియ బాట పట్టేవిధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఫౌండేషన్ చైర్మన్ వై.వెంకటేశ్వరరావుతో కలిసి సేంద్రియ వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను పరిశీలించారు. కార్యక్రమంలో రైతులు, సేంద్రియ వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఆహ్వాన నాటికలు



'చిగురు మేఘం' నాటికలోని సన్నివేశం

పొన్నూరు: పొన్నూరు కళాపరిషత్ నిర్వహణలో ప్రముఖ బుర్రకథ కళాకారులు పద్మశ్రీ షేక్.నాజర్ శతజయంతిని పురస్కరించుకుని నిడుబ్రోలు జెడ్పీ హైస్కూల్ ఆవరణలోని కళాబంధు కొల్లా రమేష్ కళావేదికపై గురువారం నిర్వహించిన ఆహ్వాన నాటికల పోటీలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. కొల్లా శ్వేత నటరాజ పూజ, అలీఖాన్ ప్రార్థనా గీతం, ఘంటసాల చతుర్వి శాస్త్రీయ నృత్యంతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. గుంటూరు అమరావతి ఆర్ట్స్ నిర్వహణ, కావూరి సత్యనారాయణ రచనకు, యేపూరి హరిబాబు దర్శకత్వంలో 'చిగురు మేఘం' నాటిక ప్రదర్శించారు. అనంతరం తాడేపల్లి మోక్షిత శాస్త్రీయ నృత్యం ప్రేక్షకులను ఆకట్టుకుంది. విజయవాడ మైత్రి కళా నిలయం నిర్వహణలో శ్రీ స్నిగ్ధ రచనకు, టి.వి. పురుషోత్తం దర్శకత్వంలో 'బ్రహ్మస్వరూపం' నాటికలో కళాకారులు తమ నటనతో ప్రేక్షకులను మెప్పించారు. స్వాతంత్ర్య సమరయోధుడు కన్నెగంటి హనుమంతు బుర్రకథ నిర్వహించారు. అనంతరం సభకు పరిషత్ కార్యనిర్వాహక అధ్యక్షులు ఆకుల సాంబశివరావు అధ్యక్షత వహించారు. పలువురు ప్రముఖులు, కళాభిమానులు పాల్గొన్నారు.

ఎక్కువ కేసుల పరిష్కారమే లక్ష్యం

నాలుగో అదనపు జిల్లా జడ్జి ఆర్ .శరత్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి

గుంటూరు లీగల్: జరగబోయే లోక్ అదాలత్‌లో మోటార్ వెహికల్ ప్రమాదాల కేసులు ఎక్కువ సంఖ్యలో పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని నాలుగో అదనపు జిల్లా జడ్జి ఆర్ .శరత్‌బాబు తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో గురువారం పలు ఇన్స్యూరెన్స్ కంపెనీస్, కంపెనీ న్యాయవాదులతో గురువారం సమావేశం నిర్వహించారు. న్యాయమూర్తి శరత్‌బాబు మాట్లాడుతూ కంపెనీ సభ్యులు, కౌన్సెల్స్ పూర్తిగా సహకరించి ఎక్కువ సంఖ్యలో కేసుల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. సమస్యలుంటే పిటిషనర్‌ను, కౌన్సెల్‌ను పిలిపించి ప్రీ సిట్టింగ్ ద్వారా కేసును రాజీ చేయవచ్చని తెలిపారు. ఎక్కువ సంఖ్యలో కేసుల పరిష్కారానికి కూడా సహకరించాలని ఆయన కోరారు. మూడో అదనపు జిల్లా జడ్జి సీహెచ్.వెంకట నాగ శ్రీనివాస రావు, రెండవ అదనపు జిల్లా జడ్జి వై.నాగరాజా, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియావుద్దీన్, బార్ ప్రెసిడెంట్ వై.సూర్యనారాయణ, ఇన్స్యూరెన్స్ కంపెనీస్, కంపెనీ కౌన్సెల్స్, ప్రతినిధులకు పలు సలహాలు, సూచనలు చేశారు. సమావేశంలో బార్ కౌన్సెల్ మెంబర్ వి.బ్రహ్మా రెడ్డి, న్యూ ఇండియా ఇన్స్యూరెన్స్, ఓరియంటల్ ఇన్స్యూరెన్స్, యునైటెడ్ ఇన్స్యూరెన్స్, నేషనల్ ఇన్స్యూరెన్స్ కంపెనీ ప్రతినిధుల, కంపెనీ కౌన్సెల్స్ పాల్గొన్నారు.

విజ్ఞానాభివృద్ధికి గ్రంథాలయాలు దోహదం



పెదకాకాని: విద్యార్థుల్లో విజ్ఞానాభివృద్ధికి, మేధో వికాసానికి గ్రంథాలయాలు దోహదపడతాయని జనవిజ్ఞాన వేదిక ప్రతినిధి వల్లభాపురపు ప్రసాద్ అన్నారు. పెదకాకాని గ్రంథాలయంలో ప్రారంభమైన సమ్మర్ క్యాంప్ కార్యక్రమంలో భాగంగా గురువారం పుస్తక ప్రదర్శన, పుస్తక సమీక్ష, విద్యార్థులకు కథలు చదివి వినిపించే కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. యోగా, పెయింటింగ్, మ్యాజిక్ వంటి వాటిల్లో విద్యార్థులకు మెలకువలు నేర్పించారు. రంగు కాగితాలతో పూలు, పక్షుల బొమ్మలు చేసి చూపించారు. విద్యార్థులతో కూడా వాటిని చేయించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వేముల విజయ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

'పేపర్ క్రాఫ్ట్స్'పై శిక్షణ



గుంటూరు ఎడ్యుకేషన్: బృందావన్ గార్డెన్స్‌లోని మహిళా బాలల గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరంలో గురువారం విద్యార్థులకు పేపర్ క్రాఫ్ట్స్‌పై శిక్షణ ఇచ్చారు. పొడుపు కథలు చెప్పడం, జనరల్ నాలెడ్జ్ అంశాలతోపాటు డ్రాయింగ్ వేసిన బొమ్మలకు రంగులు అద్దడం, పుస్తక పఠనం వంటి కార్యక్రమాలను కూడా నిర్వహించారు. గ్రంథాలయాధికారులు బి.శకుంతల, పి. సత్యశిరీష పర్యవేక్షించారు.

వైభవంగా లక్ష కుంకుమార్చన



నగరంపాలెం: స్థానిక ఆర్ అగ్రహారం శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మ వారి దేవస్థానంలో అమ్మవారి జయంతి మహోత్సవంలో భాగంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ప్రభాతభేరి అనంతరం లక్ష కుంకుమార్చన వైభవంగా చేపట్టారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో ఈరంటి వరప్రసాద్‌బాబు, కొనకళ్ల సత్యం, కోట శేషగిరి, అవరపల్లి శ్రీను, అన్నవరపు చక్రి పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

పెదకాకాని: రక్తదానం ప్రాణదానంతో సమానమని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అన్నారు. మండలంలోని తక్కెళ్లపాడు సిబార్ దంత వైద్య కళాశాల ఆర్థోడాంటిక్స్ విభాగం ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. మే 8 ప్రపంచ తలసీమియా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. సిబార్ దంత వైద్య కళాశాలలో విద్య, వైద్యసేవలు అభినందనీయమన్నారు. దంత వైద్య పరిశోధన రంగంలో చూపిస్తున్న ప్రగతిని కొనియాడారు. సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న సిబార్ యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులను ఆమె అభినందించారు. కళాశాల డీన్ డాక్టర్ ఎల్.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ.. ఉచిత దంత వైద్య శిబిరాలు, సామాజిక కార్యక్రమాల నిర్వహణలో సిబార్ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. ఈ శిబిరంలో 125 మంది విద్యార్థులు, అధ్యాపక సిబ్బంది పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం దాతలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జాతీయ దంత వైద్య మండలి సభ్యురాలు డాక్టర్ పి.రేవతి, కళాశాల డైరెక్టర్ డాక్టర్ టి.కృష్ణమోహన్, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.వి.రమణారెడ్డి, ఇతర అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యతో మరింత ఎదగాలి

గుంటూరు ఎడ్యుకేషన్: సాధారణ కుటుంబాల నుంచి వచ్చినా కష్టపడి ప్రతిభావంతులుగా నిలిచిన విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలని ఎక్సైజ్‌శాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. టెన్త్ ఫలితాల్లో 500 మార్కులకు పైగా సాధించిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు వర్సటైల్ సర్వీసెస్ ట్రస్ట్, శ్రీకృష్ణ అకాడమీ ఆధ్వర్యంలో నగదు పురస్కారంతోపాటు ప్రశంసాపత్రం, జ్ఞాపికలను బహూకరించారు. బ్రాడీపేటలోని పెన్షనర్స్ అసోసియేషన్ హాల్లో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా శ్రీనివాసులు మాట్లాడుతూ కష్టపడి చదువుకుని తల్లిదండ్రులు గర్వపడే విధంగా జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవాలని సూచించారు. ఓబీసీ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులు తమ ప్రతిభను చాటుతూ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్‌పర్సన్ పాశం శ్రీకృష్ణదేవరాయ యాదవ్, పాశం సర్దార్ అభినంద్ యాదవ్, కోనింకి మురళీకృష్ణ, ఆలా లక్ష్మీ ప్రసన్న, నెహ్రూ యువకేంద్ర జిల్లా సమన్వయకర్త కిరణ్మయి దేవిరెడ్డి, శరత్‌బాబు, ఉపాధ్యాయులు నరసింహారావు, ఎస్వీ సత్యనారాయణ, అనంగి శ్రీనివాస్, రాణి రుద్రమదేవి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అక్రమంగా వాడితే చర్యలు

- వినియోగదారులకు అధికారుల హెచ్చరిక
- తనిఖీల్లో అక్రమాల గుర్తింపు
- రూ.14.30 లక్షల జరిమానా వసూలు

కొరిటిపాడు(గుంటూరు): నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్‌ను వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సీహెచ్ వెంకటేశ్వరరావు, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.శ్రీనివాసబాబులు తెలిపారు. విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం, ఆపరేషన్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో గుంటూరు డీ–1 సెక్షన్ పరిధిలో బ్రాడీపేట, అరండల్‌పేటలో గురువారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. 55 మంది అధికారులు, 185 మంది సిబ్బంది మొత్తం 59 బృందాలుగా ఏర్పడ్డారు. 4,019 సర్వీసులు తనిఖీ చేశారు. అనుమతించినది కాకుండా ఇతర కేటగిరీలో విద్యుత్ వినియోగిస్తున్న 13 మందికి రూ.2.95 లక్షలు, అదనపు లోడు వాడుతున్న 216 మందికి రూ.11.35 లక్షలు జరిమానా విధించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ నిబంధనలకు అనుగుణంగా విద్యుత్ వినియోగించాలని పేర్కొన్నారు. పబ్లిక్ పోల్స్‌పై కనెక్షన్‌లను ఏర్పాటు చేసుకుని, విద్యుత్ మీటర్లు తిరగకుండా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీఈఈలు కె.రవికుమార్, ఎస్.మల్లికార్జున ప్రసాద్, షేక్ ముస్తాక్ అహ్మద్, ఏఈలు కె.కోటేశ్వరరావు, ఎం.సతీష్‌కుమార్, యు.శివశంకర్, కె.అక్కిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సాయం అందజేత



ఉపకార వేతనాలు, కుట్టు యంత్రాలు పంపిణీ చేస్తున్న శ్రీనివాస్ గౌడ్ తదితరులు

గుంటూరు మెడికల్: పట్నంబజారులోని సుష్మా గౌడ్ ఫౌండేషన్ కార్యాలయంలో నిరుపేద మహిళలకు కుట్టుమిషన్లు, వికలాంగులకు మూడు చక్రాలు సైకిళ్లు, పేద విద్యార్థులకు రూ.1.60 లక్షల మేరకు ఉపకారవేతనాలను అందించారు. సంస్థ అధ్యక్షుడు జల్లెడ శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ మేరకు గురువారం పంపిణీ చేశారు. పారిశ్రామిక వేత్త పామర్తి సాంబశివరావు, గుంటూరు జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు వీరంకి రంగారావు, గౌడ సేవా ట్రస్ట్ ఉపాధ్యక్షుడు చెన్ను శ్రీనివాస్ కుమార్‌ల చేతులు మీదుగా వీటిని అందించారు. సంస్థ అధ్యక్షుడు జల్లెడ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏటా తమ సంస్థ ఆధ్వర్యంలో సాయం అందిస్తున్నట్లు తెలిపారు. సంస్థ కార్యదర్శి జల్లెడ ఓంకారం, ఉపాధ్యక్షుడు నాగ వెంకట శివ ప్రసాద్ గౌడ్, కోశాధికారి జల్లెడ జయ సుస్మిత రావు గౌడ్, ప్రధాన కార్యదర్శి జల్లెడ సుష్మారావు గౌడ్, సహ కార్యదర్శి హరిత గౌడ్, ఆరెపల్లి విఘ్నేశ్వరమ్మ, బోయపాటి శ్రీకాంత్ చౌదరి, దొంతగాని సాయి గౌడ్, ఉయ్యూరు రఘు తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో తలసీమియా నివారణ



మాట్లాడుతున్న డాక్టర్ యశశ్వి రమణ

గుంటూరు మెడికల్: తలసీమియా వ్యాధి పట్ల అవగాహన పొంది ముందుగా నిర్ధారణ పరీక్షలు చేయించుకోవడం వలన నివారించవచ్చునని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ అన్నారు. గురువారం ప్రపంచ తలసీమియా డే సందర్భంగా జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో గుంటూరు జీజీహెచ్ శుశ్రుత హాలులో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ యశశ్వి రమణ మాట్లాడుతూ ప్రభుత్వం తలసీమియా బాధితులకు రూ. 12 వేలు పెన్షన్‌గా అందిస్తున్నట్లు తెలిపారు. బాధితులను జీజీహెచ్‌కు తీసుకొస్తే సరైన చికిత్స అందిస్తారన్నారు. వ్యాధిపై అవగాహన పోస్టర్లు ఆవిష్కరించారు. స్టేట్ బ్లాక్ సెల్ కన్సల్టెంట్ డాక్టర్ సోనియా మాట్లాడుతూ జన్యులోపం వల్ల వ్యాధి సంక్రమిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ బి.వి.రంగారావు, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నివారణ అధికారి డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ అపర్ణ, డాక్టర్ ఎలిజిబెత్, డాక్టర్ సుధీర్, డాక్టర్ ప్రియదర్శిని, జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ శాంసన్, ఐసీటీసీ జిల్లా సూపర్‌వైజర్ జ్యోతుల వీరాస్వామి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఎదుటే కార్యకర్తల వాగ్వాదం

సర్దిచెప్పిన ఎమ్మెల్యే



ఎమ్మెల్యే ఎదుటే గొడవపడుతున్న వర్గాలు

గుంటూరు రూరల్: పెదనందిపాడు మండలం కాట్రపాడు గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులు నిమిత్తం చెరువు పూడిక తీత గురించి ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బి.రామాంజనేయులు పాల్గొన్నారు. కార్యక్రమం ప్రారంభోత్సవం జరుగుతుండగానే అధికారపార్టీ కార్యకర్తలే ఎమ్మెల్యే ఎదుట ఉపాధి హామీ పనులు మేము చేస్తామంటే మేమే చేస్తాం అంటూ రెండు వర్గాలు బాహాబాహీకి దిగాయి. ఎమ్మెల్యే చెప్పినా పోలీసులు చెప్పినా ఇరువర్గాలు సుమారు ముప్పై నిమిషాల పాటు మీరెలా చేస్తారో మేము చూస్తాం అంటూ బాహా బాహీకి దిగారు. దీంతో పోలీసులు కలుగజేసుకుని ఇరువర్గాలను చెరొక పక్కకు తీసుకెళ్ళారు. రెండు వర్గాల వివాదం చూసి అధికారులు సైతం తమకెందుకులే అనుకుని పక్కకు పోయారు. దీంతో ఎమ్మెల్యే కలుగ జేసుకుని రెండు వర్గాలను పిలిచి గ్రామంలోని చెరువు రెండు భాగాలుగా ఉంటుంది కనుక ఒక భాగం ఒక వర్గం, మరోక భాగం మరొక వర్గం చేయాలంటూ ఇరువురికి సర్ది చెప్పారు. అదేవిధంగా అధికారులకు రెండు వర్గాలకు చెరొక భాగం ఇస్తు ప్రొసీడింగ్స్ రెడీ చేయాలంటూ అధికారులను ఆదేశించారు. దీంతో రెండు వర్గాలు సర్దుమణిగాయి. ఎమ్మెల్యే ఎదుటే రెండు వర్గాలు ఆ విధంగా వివాదాలకు దారితీస్తుంటే మా పరిస్థితి ఏమిటని అధికారులు గుసగుసలాడుకున్నారు. రెండు వర్గాల పోరుతో తాము ఇబ్బందులు పడుతున్నామనుకుంటూ గొణుక్కున్నారు. ఎమ్మెల్యే రెండు వర్గాలకు సర్దిచెప్పటంతో ఈ రోజుకు వివాదం సద్దుమణిగిందని అందరూ అనుకున్నారు.

టైలర్ షాపులో అగ్ని ప్రమాదం

మేడికొండూరు: షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించి టైలర్ షాపు దగ్ధమైన సంఘటన పేరేచర్లలో గురువారం చోటుచేసుకుంది. బాధితుడి వివరాల ప్రకారం.. షాపు యజమాని షేక్ జమీర్ మధ్యాహ్నం వచ్చేసరికి షాపులో దట్టమైన మంటలు వ్యాపించాయి. స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వగా అగ్నిమాపక శాఖ సిబ్బంది తమ వాహనంతో వచ్చి మంటలను అదుపు చేశారు. కాగా అప్పటికే రూ.2 లక్షలు విలువ చేసే నాలుగు అధునాతన కుట్టు మిషిన్లు, దుస్తులు కాలిపోయాయని బాధితుడు వాపోయాడు.

ప్రజా కాపునాడు సంక్షేమ సంఘ కార్యవర్గం ఎన్నిక

తాడేపల్లి రూరల్: ప్రజా కాపునాడు సంక్షేమ సంఘం గుంటూరు జిల్లా తాడేపల్లి పట్టణ కమిటీని గురువారం తాడేపల్లిలోని సంఘ కార్యాలయంలో ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు యర్రంశెట్టి అంజిబాబు ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏర్పాటుచేశామన్నారు. పట్టణ అధ్యక్షులుగా పులేపు భాస్కరరావు, యూత్ అధ్యక్షుడిగా నక్క నవీన్ రాజు, యూత్ సెక్రటరీగా పూడి రమణ.. ట్రెజరర్‌గా తాడికొండ నాగేశ్వరరావు.. యూత్ ప్రచార కార్యదర్శిగా అడపా నరేష్.. యూత్ జాయింట్ సెక్రటరీగా అల్లు సాయి చక్రపాణి, జాయింట్ ప్రచార కార్యదర్శిగా కేసురెడ్డి మురళీకృష్ణ.. జాయింట్ సెక్రటరీగా గాజుల వీరకృష్ణ.. పట్టణ ఉపాధ్యక్షులుగా వలివేటి రమేష్ కుమార్.. కార్యదర్శిగా కొత్తూరు వెంకట మోహనరావు, యూత్ జాయింట్ సెక్రటరీగా వీరిశెట్టి వెంకటేశ్వరరావు ఎన్నుకున్నామని తెలిపారు.

12న ఘనంగా బుద్ధ పూర్ణిమ వేడుకలు



మంగళగిరి, మంగళగిరి టౌన్: బుద్ధ జయంతిని పురస్కరించుకుని ఈనెల 12న ఆటోనగర్‌లోని రాయల్ కన్వెన్షన్ హాలులో బుద్ధ పూర్ణిమ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆహ్వాన కమిటీ అధ్యక్షుడు గుత్తికొండ ధనుంజయరావు తెలిపారు. గురువారం రాయల్ బంకెట్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో సంబంధిత గోడ పత్రికలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బుద్ధ పూర్ణిమ సందర్భంగా ప్రముఖ సాహితీ విమర్శకులు అబ్దుల్ రజా హుస్సేన్ రచించిన 'కళలసిరి మంగళగిరి' పుస్తకావిష్కరణ జరగనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బుద్ధ విహార వ్యవస్థాపకులు రేఖా కృష్ణార్జునరావు, మానవతా వేదిక కన్వీనర్ గోలి మధు, గౌరవ అధ్యక్షుడు నన్నపనేని నాగేశ్వరరావు, విశ్వశాంతి కళాపరిషత్ కన్వీనర్ పొట్లాబత్తుని లక్ష్మణరావు, పిరమిడ్ మాస్టర్ ఆకురాతి శంకరరావు, ప్రజానాట్యమండలి కళాకారులు కంచర్ల కాశయ్య, సంధుబట్ల భూపతి, అల్లక తాతారావు పాల్గొన్నారు.